# నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- మొదటి రోజు వచ్చే పీవీటీజీ విద్యార్థులకు రూ.500 నజరానా
- ఆశ్రమాల్లో నూతనంగా అమలు

సీతంపేట : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలన్నీ సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. అయితే మొదటి రోజే పాఠశాలలకు వచ్చే పీవీటీజీ (ప్రిలిమినరీ వాలనర్‌బుల్ ట్రైబ్ గ్రూప్) విద్యార్థులకు ఐటీడీఏ తరపున రూ.500లు ఇవ్వనున్నారు. ఈ మేరకు నెలరోజుల కిందట జరిగిన హెచ్‌ఎం, వార్డెన్ల సమావేశంలో ఐటీడీఏ పీవో జల్లేపల్లి వెంకటరావు ప్రకటించారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులు వస్తే సకాలంలో సిలబస్‌లు పూర్తి కావడమే కాకుండా విద్యార్థుల క్రమ శిక్షణలో ఒక భాగమని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే తల్లిదండ్రులను ప్రోత్సాహించినట్టవుతుందని తెలియజేస్తున్నారు. జిల్లాలో 47 ఆశ్రమ పాఠశాలలు, నాలుగు గురుకులాలు, మరో మూడు కేజీబీవీలు, రెండు మినీ గురుకులాలు, రెండు జూనియర్ కళాశాలలున్నాయి. దాదాపు 15 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. సగం మంది వరకు పీవీటీజీ విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా సకాలంలో పాఠశాలకు వస్తే వీరికి రూ.500ల చొప్పున ఇవ్వడానికి ఇప్పటికే హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చారు. చెక్కురూపంలో ఇవ్వాలని కూడా తెలియజేశారు.



సీతంపేట : గిరిజన విద్యార్థినులు

## బడి బాటలో చిన్నారులు

భామిని : వేసవి సెలవుల్లో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపిన పిల్లల ఆటలకు టాటా చెప్పే సమయం వచ్చేసింది. పొలాలు, కళ్లాలు, ఖాళీ స్థలాల్లో ఇలా ఎక్కడికక్కడ కొద్ది రోజులుగా ఆటలతో సందడి చేసిన చిన్నారులు సోమవారం నుంచి బడి బాట పట్టనున్నారు. ఇకపై ఆటలకు సెలవు చెప్పి పలక, పుస్తకం పట్టనున్నారు. మండలంలో నాలుగు జెడ్పీ హైస్కూళ్లు, 15 ఎంపీయూపీ పాఠశాలలు, 32 ప్రాథమిక పాఠశాలలు, ఒక ఏపీ మోడల్ స్కూల్, ఒక ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఒక కేజీబీవీ, మూడు ప్రైవేటు పాఠశాలల పరిధిలో సుమారు ఆరు వేల ఐదు వందల మంది విద్యార్థు బడి బాట పట్టనున్నారు.



భామిని : గోళీలాట ఆడుతున్న చిన్నారులు